రామయోగి తాత ఆరాధనోత్సవాలు


గుత్తికొండ రామయోగితాత జీవ సమాధి


కురిచేడు: మండలంలోని పొట్లపాడులో వేంచేసి ఉన్నశ్రీ గుత్తికొండ రామయోగితాత ఆరాధనోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. భక్తుల కోరికలను గుత్తికొండ రామయోగితాత తీర్చుతాడనేది ప్రతీతి. పొట్లపాడులో రామయోగి తాత శాలివాహన శకం శతాబ్దం 1833 విరోధి కృతు నామ సంవత్సరం పుష్య బహుళ స్థిరవారం రాత్రి ఒంటి గంటకు జీవసమాధిలో కూర్చుని జీవ బ్రహ్మైక్యం చెందినట్లు శాసనాలు చెబుతున్నాయి. భక్తులు అప్పటి నుంచి పొట్లపాడులో మఠం నిర్మించి నిత్య పూజలు చేస్తున్నారు. ప్రతి ఏడాది పుష్య మాసం బహుళ తదియ తిథినాడు ఉత్సవాలు జరుపుకోవటం రామయోగి తాత భక్తులకు, స్థానికులకు ఆనవాయితీ. మూడు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి పొంగళ్లు, కొబ్బరికాయలు, తలనీలాలు ఇచ్చి మొక్కు తీర్చుకుంటారు. ఆ రోజు రాత్రికి జాతర జరుపుకుంటారు. స్వామి వారి ఉత్సవమూర్తిని రథోత్సవంతో గ్రామోత్సవం చేస్తారు. రెండో రోజు యోగితాత ఆరాధ్య దైవం త్రిపుర సుందరీదేవికి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మూడో రోజు గ్రామస్తులు గురుపూజ నిర్వహిస్తారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి.

రూటు ఇలా..

గుంటూరు, విజయవాడ, విశాఖ పట్నం నుంచి వచ్చే భక్తులు రైలు మార్గంలో అయితే కురిచేడు, దొనకొండ రైల్వే స్టేషన్‌లో దిగి ఆటోల్లో వెళ్లేందుకు అవకాశం ఉంది. బస్సు మార్గంలో వచ్చే భక్తులు మండల కేంద్రమైన కురిచేడులో దిగి ఆటోల్లో పొట్లపాడు వెళ్లా ల్సి ఉంటుంది. పొట్లపాడు మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒంగోలు, నెల్లూరు నుంచి వచ్చే భక్తులు కురిచేడు నుంచి వెళ్లవచ్చు.

యోగి తాత చరిత్ర

త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గంగయ్య, నాగమ్మలకు రామయ్య జన్మించాడు. రామయ్య జన్మించిన కొద్ది కాలానికే తండ్రి గంగయ్య మరణించాడు. పేద కుటుంబం కావడంతో రామయ్య ఆలనా పాలనా తల్లి నాగమ్మ మోయాల్సి వచ్చింది. రామయ్య చిన్నతనం నుంచి మౌనంగా, పరధ్యానంగా ఉండేవాడు. సహ పిల్లలతో కూడా కలిసేవాడు కాదు. ఆయనకు పదేళ్ల వయసులో డొక్కల కరువు వచ్చింది. బతుకు బండి లాగడం కష్టమైంది. దీంతో నాగమ్మ రామయ్యతో కలిసి బతుకు జీవుడా అంటూ పొట్లపాడు చేరింది. చీకటి పడటంతో ఒక అరుగుపై కొడుకుతో నిద్రించింది. పొట్లపాడు గ్రామస్తులదీ అదే పరిస్థితి. మూగజీవాలు కూడా పశుగ్రాసం లేక అలమటిస్తున్నాయి. అందరు కలిసి గుత్తికొండ బిళం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పోతంశెట్టి వారిది పెద్ద కుటుంబం. పశువులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వారికి పశువుల వద్దకు ఒక కుర్రవాడు కావాల్సి వచ్చింది. తెల్లవారు జామున నిద్రలేచిన పోతంశెట్టి వారి ఇల్లాలు అరుగుపై నిద్రిస్తున్న వారిని లేపింది. ఎవరు మీరు? ఎక్కడి నుంచి వచ్చారు? వంటి వివరాలు అడిగి తెలుసుకుంది. వారు పనికోసం వచ్చినట్లు చెప్పారు. స్పందించిన పోతంశెట్టి వారు భోజనాలు పెట్టి పశువులు మేపేందుకు కుర్రాడు కావాలని పోతంశెట్టి దంపతులు తమ మనసులోని మాటను బయట పెట్టారు. అందుకు నాగమ్మ అంగీకరించింది. గ్రామస్తులంతా గుత్తికొండ బిళం వెళ్లారు. అక్కడ పశువులకు నీరు, మేత దొరకడంతో రైతులు ఆనందపడ్డారు. ఇలా ఉండగా ఒకరోజు రామయ్యకు బిళం అంతా తెల్లగా తేజోవంతమైన వెలుగుతో కనిపించింది. ఆ వెలుగు ఎక్కడిది? అని రామయ్య పరిశీలిస్తూ ముందుకు వెళ్లాడు. అక్కడ మహర్షులు కనిపించారు. రామయ్య సిద్ధపురుషుడుగా మారే సమయం ఆసన్నమైంది. రామయ్య మహర్షుల వద్దకు వెళ్లాడు. వారు రామయ్య జన్మ వృత్తాంతాన్ని, చేయాల్సిన కార్లాను తెలిపి నాలుకపై బీజాక్షరాలు లిఖించి దివ్యశక్తిని ప్రసాదించారు. సిద్ధిపొందిన అనంతరం సంచారం చేసి జీవసమాధికావాలని ఆజ్ఞాపించి అదృశ్యమైనారు. అంతట రామయ్య బిళంలోని సెలఏరులో మునిగి తన ఇష్టదైవమైన త్రిపురసుందరీదేవి సన్నిధికి చేరాడు. రామయ్య ఎంతకీ రాకపోయేసరికి రైతులు, సహచరులు ఆందోళన చెంది పరుగున వెళ్లి మిగతా వారితో చెప్పారు. రోజులు గడుస్తున్నా రామయ్య జాడ తెలియలేదు. కొంతకాలానికి వర్షాలు పడి చెరువులు నిండి బీళ్లు పచ్చబడ్డాయి. దీంతో రైతులంతా పొట్లపాడుకు తిరిగి వచ్చారు. రామయ్య 12 సంత్సరాలు తపోదీక్ష చేసి సిద్ధి పొందాడు. యోగిగా మారాడు. చివరకు రామయ్య రామయోగిగా మారాడు. చివరకు రామయ్య రామయోగి అయ్యాడు. బాలాత్రిపుర సుందరీదేవి అనుగ్రహించింది. అనంతరం అమ్మవారి ఆజ్ఞ తీసుకుని జైబాలాత్రిపురసుందరీ మాయా.. నిజం... అంటూ సంచారం ప్రారంభించాడు. అందరూ పిచ్చివాడని ఎగతాళి చేశారు. పిల్లలు వెంటపడేవారు. పెద్దలు గ్రామాల నుంచి వెళ్లగొట్టేవారు. ఆకతాయిలు, చిన్నారులు రాళ్లు వేస్తూ హేళన చేసినా యోగితాత చిరుదరహాసం ప్రదర్శించేవారు. తిరిగి గుత్తికొండ చేరాడు. రామయోగితాత ప్రవర్తనకు అక్కడ ప్రజలు దూషించేవారు. ఒక రోజు కొట్టి పంపే ప్రయత్నం చేశారు. జై త్రిపురసుందరీ.. మాయా.. నిజం.. అనగా ఎక్కడి వారు అక్కడే నిలబడిపోయారు. ఈ సన్నివేశాన్ని దూరం నుంచి గమనించిన కొందరు గ్రామస్తులు యోగితాతను ప్రార్థించారు. ఆ కాలంలో ఉన్న యోగిపుంగవులు గుంటూరు నీల్లమస్తాన్, చేజర్ల తుంగదుర్తి బుచ్చయ్య, ధర్మవరం చిరుమామిళ్ల సుబ్బయ్య తాత, సత్తెనపల్లి ఫిరోజ్ మహర్షి వంటి వారిని రామయోగి తాత కలుసుకున్నారు. దేశసంచారం ముగించుకొని ఆయన తిరిగి పొట్లపాడు చేరాడు. అనేక మహిమలతో ప్రజలను అశ్చర్యాలకు గురిచేశాడు. సంతానం లేనివారు ఇప్పటికీ ఉత్సవాల్లో పాల్గొని ఉపవాస దీక్ష చేసి తాత సన్నిధిలో వరపడతారు. వారికి సంతాన ప్రాప్తం కలుగుతుందనేది ఇక్కడి ప్రజల నమ్మకం. అలా జన్మించిన వారికి తాత పేరు కలిసి వచ్చేలా నామకరణం చేస్తుంటారు. గాలి, దెయ్యం ఉన్న వారికి తాత సన్నిధిలోని విభూది పెడితే తగ్గిపోతుందని నమ్మకం. విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, నంద్యాల వంటి ప్రాంతాల నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరవుతారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి గదులు, అన్నదానం వంటి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త వేమా రమణయ్య తెలిపారు.


గుత్తికొండ రామయోగి తాత చిత్రపటం


గుత్తికొండ రామయోగి తాత ఉత్సవమూర్తి


బాలాత్రిపురసుందరీ దేవి


భోగి మంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


ముంగిళ్లలో వేసిన భోగి మంట


బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరుపాడురామాలయం సెంటర్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాలం రెడ్డి వీరారెడ్డి ధర్మపత్ని లక్ష్మీనరసింహ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు పండుగ రోజు స్లో బైక్ రేస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఎర్రబలి ధనుష్ రెడ్డికి 5,116 రూపాయలు, ద్వితీయ బహుమతి కాపూరి విజయబాబుకు 3116, తృతీయ బహుమతి ధరణికోటి హరికృష్ణకు 1116 అందజేశారు. కార్యక్రమంలో పోలంరెడ్డి సూరారెడ్డి, రమణారెడ్డి, వీర నాగిరెడ్డి, కోటిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, అంజిరెడ్డి, సుబ్బారెడ్డి, యోగిరెడ్డి, హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ రామిరెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు

దొనకొండ: మండలంలోని గ్రామాల్లో నూతన ఏడాది సందర్భంగా మొదట వచ్చే పండగ సంక్రాంతి, సోమవారం భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరం కావడంతో ఈ ఏడాది రైతులు పండించిన పంటలు సిరి సంపదలతో ఇళ్లకు చేరటంతో ఉత్సాహంగా తెల్లవారు జామున భోగి మంటలు వేశారు. నూతన వస్త్రాలు ధరించారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో పురోహితులు మణిబాబు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దర్శి: మండలంలో భోగి పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే ఇంటి ముంగిళ్లలో భోగి మంటలు వేసి చలి కాపుకున్నారు. ముంగిళ్లలో భోగి కుండల రంగు రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. ఇంటికి వచ్చిన కొత్త అల్లుళ్లతో నివాసాలు సందడిగా మారాయి.

దొనకొండ: స్థానిక విజయాంజనేయస్వామి దేవాలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కుట్టు మిషన్, రెండో బహుమతి గ్రైండర్, మూడో బహుమతి డ్రెస్సింగ్ టేబుల్, నాల్గో బహుమతి మిక్సీ, ఐదో బహుమతి కుక్కర్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఉదయం ఎంట్రీ ఫీజు రూ.50 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని బాలిరెడ్డి కోరారు.


జ్ఞానప్రసూనాంబదేవి


కాళహస్తీశ్వరస్వామి

పుల్లలచెరువు: తెలుగు సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి పండగని యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ అన్నారు. సోమవారం పుల్లలచెరువులో పొట్లపల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ తెలుగు సంప్రదాయలకు నిలయంగా సంక్రాంతి పండగను జరుపుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆనందోతాహాలతో పండగను జరుపుకోవాలన్నారు. ముగ్గుల పాటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం సీఐ, ఎస్ఐ సంపతకుమార్‌లను ఘనంగా సన్మానించారు.

పెద్దదోర్నాల: మండలంలో భోగి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్నానాలు ఆచరించి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా భోగి మంటలు వేసుకున్నారు. సూర్యుడు దక్షిణాయనం, ధనుర్మాసం చివరి రోజుల్లో నిర్వహించే పండగ భోగి. భోగి రోజు చలి తారా స్థాయిలో ఉంటుంది. అందుకే వాతావరణంలో కాస్త వెచ్చదనానికి భోగి మంటలు వేసుకుంటారు. దీంతో పాటు చిన్నారులకు భోగి పండ్లు పోశారు. చిన్నారులకు ఎక్కువగా దిష్టి తగులుతుందని, దీన్ని పోవటానికి భోగి పండ్లు పోస్తే మంచిదని నానుడి. భోగి పండగను పురస్కరించుకుని ఎంపీపీ గుమ్మా పద్మజ, జెడ్పీటీసీ సభ్యురాలు దుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారికలు మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

పుల్లలచెరువు: భోగి పండగను మండల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో తెల్లవారు జాము నుంచే భోగి మంటల సందడిమొదలైంది. వీధులన్నీ అందమైన రంగువల్లులతో, గొబ్బెమ్మలతో ఆందంగా అలంకరించారు. మూడు రోజులుగా నిర్వహించే సంక్రాంతి పండగను స్వాగతిస్తూ తెలుగు లోగిళ్లలను సుందరంగా ముస్తాబు చేశారు. రంగుల, రంగులు, ముగ్గులు వేస్తూ తెలుగింటి ఆడపడుచులు సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు. కొందరు సంప్రదాయంగా రేగిపళ్లు తీసుకుని పిల్లలకు భోగి పళ్లు సన్మానాలు చేయించారు. మరి కొందరు అందంగా వేసిన ముగ్గులు రంగులతో పాటు రేగిపళ్లను కూడా చల్లారు. అనంతరం ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

పెద్దారవీడు: సంక్రాంతికి ముందు రోజు భోగి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముందు రంగులతో ముగ్గులు అలంకరించారు. చిమ్మచీకట్లను చిల్చుకుంటూ వెలుగులు నింపే భోగి మంటలు పాతకు స్వస్తి పలికి కొత్త దనానికి నాంది పలుకుతుందని ప్రజల నమ్మకం. తెల్లవారు జామున ఎవరికి వారు తమ వీధిలో, గృహాల ముందు ఇళ్లల్లో పనికిరాని కలప, కర్రలు, మొద్దులు తదితర వస్తువులను మంటల్లో వేసి ఆనందంగా జరుపుకున్నారు.

భోగి మంటలు వెలిగించిన ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ తన నివాస గృహం వద్ద భోగి మంటలు వెలిగించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబుల్‌రెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏకుల మునలారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్, బిజ్జం రమణారెడ్డి, కె.సత్యనారాణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రభాకర్


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


దొనకొండలో భోగి మంటలు


పెద్దదోర్నాలలో భోగి మంటలు వేస్తున్న కుర్రోళ్లు

లాటరీలో తగిలిన బైక్ అందించిన బూచేపల్లి


బుల్లెట్ నడుపుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


లాటరీలో పొందిన బైక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: పట్టణంలోని రాజా మొబైల్స్‌లో స్కాచ్ కార్డు ద్వారా బైక్ పొందిన ఎర్రొబనపల్లి యల్లయ్యకు దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నూతన బైక్‌ను సోమవారం అందజేశారు. శివప్రసాద్‌రెడ్డి బైక్‌ను అందించి యల్లయ్యకు అభినందనలు తెలిపారు. మొబైల్ షోరూం యజయాని చెవిరెడ్డి రాజారెడ్డి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం దర్శి మాజీ సర్పంచ్ భర్త, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మునగా నరశింహారావుతో మాట్లాడారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త సిద్ధి కోటిరెడ్డి కొనుగోలు చేసిన నూతన బుల్లెట్ వాహనాన్ని తొలి శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణం


అలంకరణలో గోదాదేవి, రంగనాథస్వామి

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో ఘనంగా శ్రీగోదాదేవి రంగనాథ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం సోమవారం 8 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, సహస్త నామార్చనలు, దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, ఆశ్రమము ఉత్తర ద్వార పూజ నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణం వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెదన్నపాలెం గ్రామానికి చెందిన చెన్నుబోయిన పాపయ్య, సుజాత లక్ష్మీ, దండూరి చిన్న గురవయ్య, కోటేశ్వరమ్మ దంపతులు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మకర సంక్రాంతి సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. భైరవానందస్వామి భక్తులకు సదుపాయాలు కల్పించారు.

పీటర్ మృతదేహానికి ఎమ్మెల్యే బూచేపల్లి నివాళి


పీటర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గర్నెపూడి పీటర్ సోమవారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి కారణాలు కుమారుడు కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బూచేపల్లి హామీ ఇచ్చారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో దహనం

దొనకొండ: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సోమవారం వీవీపురం, ఓబ్బాపురం ప్రాంతాల్లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచం అంటూనే సర్ చార్జీల పేరుతో వినియోగదారులపై విపరీతమైన భారాన్ని మోపుతోందన్నారు. గత ప్రభుత్వం ప్రజల మీద విద్యుత్ చార్జీలు పెంచిందని, అప్పటి ప్రతిపక్షం టీడీపీ బాదుడే బాదుడు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టిందని, అదంతా మరిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత హామీలు పూర్తిగా విస్మరించిందని ఎద్దేవా చేశారు. ట్రూ అప్ వంటి వివిధ రూపాల్లో ప్రజల మీద విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వం హామీలు మరిచి కుంటి సాకులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూడాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న నరసింహులు, కె.కిరణ్‌కుమార్, ఆర్.కోటేష్, వై.ప్రభాకర్, పి.కాశయ్య, సుధాకర్, దావీదు, ఆదాం పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగ పవిత్ర ఆలయ క్షేత్ర ప్రాంగణంలో దర్శి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ శ్రీనివాస్రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు, అనాధలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ నెలకుర్తి మాల్యాద్రి ఆర్థిక సహకారంతో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశామని చెప్పారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ పూర్తిగా దాతల సహాయ సహకారాలతో నడుస్తోందని, దాతలు ముందుకు రావాలని కోరారు. సమస్త కార్యనిర్వాహణ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకట్ రెడ్డి, డైరెక్టర్ నెలకుర్తి రామాంజనేయులు, గొల్లపాటి శ్రీనివాసాచారి, బంధుమిత్రులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపరుచుకోవాలి

తాళ్లూరు: గ్రామస్థాయిలో వేస్ట్ కీపింగ్ చేస్తున్న కార్మికులు ఆ వృత్తుల నుంచి విముక్తి చెంది వారు జీవనోపాధులు మెరుగుపరుచుకునేందుకు చిరు వ్యాపారాలను ప్రోత్సహించటం కోసం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న మహోన్నతమైన కార్యక్రమం అభినందనీయమని దారావారిపాలెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ భీమిరెడ్డి రామిరెడ్డి కొనియాడారు. దారావారిపాలెంలో పాముల కాలనీలో వేస్ట్ కీపింగ్ చేస్తున్న కుటుంబాలను గుర్తించి డీబీఆర్సీ స్వచ్ఛంద సేవ సంస్థ ఫ్యాన్సీ వ్యాపార వస్తువుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడారు. నాగులూరి స్వామి యేలు, కోటయ్య, ఆబోతు కొండయ్య పాల్గొన్నారు.